## ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణుల

# నైపుణ్యం అసాధారణం

## తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**హైదరాబాద్, అక్టోబర్18(కెరటం ప్రతినిధి)**

ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణుల నైపుణ్యం అసాధారణమని, ఈ వేదిక విద్యాపరమైన ప్రయత్నం మాత్రమే కాదని, అత్యున్నత విజ్ఞాన వేడుకని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్ 2024ను ఆలంకృత రిసార్ట్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ కాన్ఫరెన్స్ తెలంగాణలో 9వది, సౌత్ జోన్లో 19వది. ప్రకృతి, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ కలిసే 'బేసిక్స్ అండ్ బియాండ్' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ ఈవెంట్ ది అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్ జోన్ (ఏఓఐ ఎస్ జెడ్) ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ ఈవెంట్ మూడు రోజుల పాటు జరగనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సు సహకారం, భాగస్వామ్య అభ్యాస స్ఫూర్తిని పెంపొందించనుందని



తెలిపారు. చెవి, ముక్కు, గొంతు స్పెషాలిటీల సంరక్షణ అభివృద్ధికి అంకితమైన నిపుణుల నిబద్ధతకు సంతోషిస్తున్నానని తెలిపారు. ఈఎన్‌టీ విపరీ తమైన అభివృద్ధి సాధించిందన్నారు. ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణుల సామర్థ్యానికి గుర్తింపు లభించిం దన్నారు. ఇప్పుడు న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, తల, మెడ శస్త్రచికిత్స వంటి సూపర్ స్పెషాలిటీలలో పని చేయడానికి అనుమతి స్తున్నారని తెలిపారు. ఈ అభివృద్ధి కేవలం వైద్య పురోగతిని మాత్రమే కాకుండా, ఈ రంగంలోని నిపుణులు తమ వృత్తిలో చూపే నిబద్ధతకు, నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. హైదరాబాద్ ముఖ్యమైన వైద్య కేంద్రంగా మారిందన్నారు. భారతదేశం నుంచి మాత్రమే కాకుండా విదేశాల నుంచి కూడా రోగులను ఆకర్షిస్తుందన్నారు. ప్రత్యేకంగా ఈ నగరానికి ఈశాన్య రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున రోగులు వస్తున్నారని తెలిపారు. ఈ సదస్సుకు దక్షిణాది రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి అధ్యాపకులు రావడం ఆలోచనల మార్పిడికి ఒక వేదికగా నిలుస్తుందని తెలిపారు. చెవి ద్వారా శబ్దం, ముక్కు ద్వారా సుగంధ మార్గం, గొంతు ద్వారా మాట వ్యక్తమవుతుందని ఒక సంస్కృత శ్లోకాన్ని ఉటంకించారు. ఈ మూడూ జీవితం సారాంశం అన్నారు. ఈ కాన్ఫరెన్స్ కేవలం విద్యాపరమైన ప్రయత్నం మాత్రమే కాదని, అత్యున్నత విజ్ఞానం వేడుక అని తెలిపారు. సున్నితమైన భాగాలతో పని చేసే ఈఎన్‌టీ నిపుణులు కేవలం శస్త్ర వైద్యులు మాత్రమే కాదని, మన ఇంద్రియాల జీవన నాణ్యతను కాపాడేవారన్నారు. వారానికి ఒకరోజు మీ సేవలను ఉచితంగా అందించడం ద్వారా ఉన్నతమైన వృత్తి నిజమైన స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అవసరమైన వారికి అందుబాటులో ఉండేలా ధరలను గణనీయంగా తగ్గించాలన్నారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ డీఎస్ దీనదయాల్ మాట్లాడుతూ ఈ ఈవెంట్ సాంకేతికత ఈఎన్‌టీ సేవలను ఎలా మారుస్తుందో? అన్వేషించే కీలకమైన పరిస్థితులను సూచిస్తుందన్నారు. ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆరోగ్య సంరక్షణను విప్లవాత్మకంగా మార్చబోతుందని తెలిపారు. ఈఎన్‌టీ నిపుణుల మధ్య సహకారం, జ్ఞానం పెంపొందించడానికి ఈ సంవత్సరం ఇక్కడ సమావేశమయ్యామని తెలిపారు. రాబోయే రెండు రోజులలో ఓటోలారిన్జాలజీ రంగంలో తాజా పరిశోధనలు, సాంకేతికతలను కవర్ చేసే చర్చలు, ప్రసంగాలు ఉంటాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి టెక్నాలజీ ఈఎన్‌టీ ఫీల్డ్ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

ఈ సందర్భంగా ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సులో నర్వ్ స్టిమ్యులేషన్ వంటి కొత్త చికిత్సలను ప్రదర్శించడానికి, వివిధ అలర్జీలకు అధునాతన చికిత్సలను చర్చించనున్నారని తెలిపారు. ఈ ఈవెంట్ లక్ష్యం, రోగి సంరక్షణను మెరుగుపరచడం, చికిత్సా ఖర్చులను తగ్గించడం ఆధునిక పరిష్కారాలను అందించడం అన్నారు.

ఈ సందర్భంగా ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ సమన్వయకర్త డాక్టర్ డీ ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణాది ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణుల సదస్సు ప్రతీ సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో జరుగుతుందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇది రెండో సారి అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర దక్షిణాది రాష్ట్రాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. మూడు రోజులు జరగనున్న ఈ ఈవెంట్ ఈఎన్‌టీ నిపుణుల మధ్య సహకారం, జ్ఞానాన్ని పంచుకోవడం లక్ష్యంగా ఉంది. తద్వారా నైపుణ్యం, తాజా పురోగతులపై అవగాహన పెరుగుతుంది. వర్క్‌షాపులు, ఉపన్యాసాలు, పరస్పర చర్చలతో కూడిన సమగ్రమైన శిక్షణా అనుభవం లభిస్తుంది. సంప్రదాయ వైద్యం, ఆధునిక సాంకేతికత మధ్య వారధిగా ఈ ఈవెంట్ నిలిచింది.

ఈ రంగంలో అతి తక్కువ హానితో శస్త్రచికిత్సలు, సాంకేతిక ఆవిష్కరణలపై చర్చ జరుగుతుంది. ముఖ్యంగా కంటి ద్వారా నిర్వహించిన మెదడు శస్త్రచికిత్సలో వచ్చిన విజయవంతమైన పద్ధతి ఉంటుంది. ఈ మినిమమ్ ఇన్వాసిస్ పద్ధతి కంటి సాకెట్‌లో ఒక చిన్న కోతతో కూడిన ఈ ప్రక్రియ కణజాల నష్టాన్ని తగ్గిస్తుంది. ఇది శస్త్రచికిత్స అనంతర సమస్యలను తగ్గిస్తుంది. రోగులు వేగంగా కోలుకునేలా చేస్తుంది. ఈఎన్‌టీ కేర్‌లో రోబోటిక్ సర్జరీల రాక అజెండాలో మరో విశేషమైన అంశం. ముఖ్యంగా చెవి, ముక్కు, గొంతు, పుర్రె సర్జరీల కోసం ఈ ప్రక్రియలు మొదటిసారి నిర్వహిస్తున్నారు. మానవ చేతులు చేరడం కష్టమైన ప్రాంతాలకు సులభంగా చేరవచ్చు. అసమానమైన కచ్చితత్వాన్ని అందిస్తాయి. రోగి ఫలితాలను మెరుగుపరుస్తాయి. కృత్రిమ మేధస్సు కూడా గణనీయమైన పురోగతిని సాధిస్తుంది. ఇది రోగ నిర్ధారణలో ఎక్కువ కచ్చితత్వం, ప్రామాణీకరణను ప్రోత్సహిస్తుంది. రోగులు స్థిరమైన, విశ్వసనీయమైన సంరక్షణను పొందేలా చూస్తుంది. ఈఎన్‌టీ రుగ్మతలకు ఎలా చికిత్స చేయాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పునర్నిర్మిస్తుంది.

---

## అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో

# మచన్‌పల్లి చెరువుకు కొత్త శోభ

**హైదరాబాద్, అక్టోబర్18(కెరటం ప్రతినిధి)**

అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మచన్‌పల్లి గ్రామంలో పునరుద్ధరించిన చెరువును తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్ఐఐసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఈ విష్ణు వర్ధన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీంతో ఈ చెరువు కొత్త శోభను సంతరించుకుంది. అంగన్‌వాడీ కేంద్రాన్ని పునర్నిర్మించారు. సోలార్ స్ట్రీట్ లైట్ల ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టులు అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇన్‌కమ్యూనిటీస్ కార్యక్రమంలో భాగంగా సెర్ప్ మద్దతుతో చేపట్టారు. ఈ సందర్భంగా విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్లు, పరిశ్రమల నాయకులు లోకల్ కమ్యూనిటీల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఉద్యోగాల సృష్టి, ఆదాయం పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం మాత్రమే కాకుండా, సమాజ అభ్యున్నతిలో కూడా పాల్గొంటున్నారని చెప్పారు.

ఈ సందర్భంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆసియా పసిఫిక్, మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా డేటా సెంటర్ ఆపరేషన్స్ డైరెక్టర్ సాజీ పీకే మాట్లాడుతూ మచన్‌పల్లి గ్రామంలో ఉన్న 65 ఎకరాల చెరువు కొన్నేళ్లుగా పాడుబడి ఉందన్నారు. దీంతో దీని సామర్థ్యం తగ్గిందన్నారు. చెత్తా చెదారం, కలుపు మొక్కలతో నిండిపోయిందని చెప్పారు. దీంతో ఈ చెరువును పూర్తి



సామర్థ్యానికి తీసుకురావడానికి నడుం కట్టామన్నారు.. నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి డీసిల్టింగ్ (చెత్తను తొలగించడం) చేశామన్నారు. ఈ గ్రామంలో పూర్వం ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని పునర్నిర్మించి కొత్త అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. పరిశుభ్రమైన తాగు నీటి కోసం ఈ డ్రైవ్‌లో రెండు నీటి శుద్ధీకరణ వ్యవస్థలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్కటి 250 నుంచి 500 లీటర్ల సామర్థ్యం కలదన్నారు. మాచన్‌పల్లి గ్రామంతో పాటు మాచన్‌పల్లి తాండాలో సురక్షితమైన తాగు నీటిని అందించడానికి ఇది ఏర్పాటు చేశామన్నారు. వీధులలో బాగా వెలుతురు ఉండేలా గ్రామం అంతటా 30 సోలార్ వీధి దీపాలు, గ్రామ కూడలి వద్ద సోలార్ హై-మాక్స్ దీపం ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రంథాలయం, కమ్యూనిటీ సెంటర్‌ను నిర్మించే ప్రక్రియలో ఉన్నామన్నారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వీటిలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వ్యవసాయ పల్లాలు, చెరువులు, ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల పునరుద్ధరణలో ఉన్నాయన్నారు. గతంలో షాబాద్, కందుకూరు మండలాలు సహా రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణిత (స్టెమ్) విద్యను ప్రోత్సహించేందుకు థింక్ బిగ్ స్పేసెస్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇండియా లీడ్ - డేటా సెంటర్ ఆపరేషన్స్ ఆదిత్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

---



## రీజనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌కు

# 'రెసోనెన్స్' విద్యార్థులు

**హైదరాబాద్, అక్టోబర్18(కెరటం ప్రతినిధి)**

'రెసోనెన్స్' హైదరాబాదుకు చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు అత్యంత ప్రతిష్టాత్మక ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైయర్ ఇన్ మ్యాథమెటిక్స్ (ఐఓక్యూఎం) క్లియర్ చేసి రీజనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ (ఆర్ఎంఓ) 2024 కి అర్హత సాధించారు. ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైయర్ ఇన్ మ్యాథమెటిక్స్ ని దేశంలోని గణిత ఉపాధ్యాయ సంఘం నిర్వహిస్తుంది. ఇది అపూర్వమైన విజయం. ఎందుకంటే, ఒకే పాఠశాల నుంచి ఇంతమంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత కఠినమైన మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో మా విద్యార్థులు విజయం సాధించడం సంతోషకరమైన విషయం అన్నారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న దృఢ నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. అద్భుత ఫలితాలను పునరావృతం చేయడం హర్షణీయమన్నారు. గత ఐదారు సంవత్సరాల నుంచి గమనిస్తున్న అంశం ఏమిటంటే, ఐఓక్యూఎంలో ఉత్తీర్ణ సాధించి ఆర్ఎంఓలో అదే కొనసాగిస్తే, ఐఐటీ, నీట్లో అగ్రస్థానం పొందడం సులభమని తేలిందన్నారు.

## ఖమ్మం జిల్లా మహాసభ అభివృద్ధికి

# వనమా సూరి కృషి అభినందనీయం

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దారా రమేష్
- జిల్లా ఆర్యవైశ్య ప్రముఖులకు ఘనంగా సన్మానం



**కొత్తగూడెం, అక్టోబర్18(కెరటం ప్రతినిధి)**

ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి వనమా సూరి కృషి అభినందనీయమని సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దారా రమేష్ అన్నారు. ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేవంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పలువురు వైశ్య ప్రముఖులను ఘనంగా సత్కరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు ధార రమేష్, రాష్ట్ర ఆర్యవైశ్య మహసభ కార్యవర్గ సభ్యులు పెండ్యాల విజయ భాస్కర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పొలిటికల్ కమిటీ చైర్మన్ కొదుమూరి.కోటేశ్వరరావు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు దారా ధీరజ్‌లకు ఖమ్మం జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు వనమా వేణుగోపాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వనమా విశ్వేశ్వరరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చారుగుండ్ల నరసింహమూర్తి మెమెంటులు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దారా రమేష్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల పదవీకాలంలో వనమా సూరి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం, సంఘం అభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమని అన్నారు. సభ్యత్వ నమోదులో పట్టణ కమిటీ సహకారంతో ఖమ్మం జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో ఉంచడానికి సూరి చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు.












## కస్టమర్లకు నాణ్యమైన సేవలు అందించాలి

- బిజేపి జిల్లా అధ్యక్షులు కె.వి రంగాకిరణ్
- పాల్వంచలో శుభ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం



**పాల్వంచ, అక్టోబర్18(కెరటం ప్రతినిధి)**

కస్టమర్లకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను అందించాలని బిజేపి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కె.వి రంగాకిరణ్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని కుంటినాగులగూడెంలో ఏర్పాటు చేసిన శుభ ఫిల్లింగ్ స్టేషన్‌ను శుక్రవారం డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావుతో కలిసి కె.వి రంగాకిరణ్ ప్రారంభించారు. శుభ ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు ముప్పాళ్ళ పద్మ, జాస్తి ధనలక్ష్మిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి సామాన్యుడికి కూడా వాహనం నిత్యావసరమైన పరిస్థితులలో క్వాలిటీ, క్వాంటిటీ ముడి సరుకును అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ మాజీ జెడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, కందుకూరి రాము, దారా చిరంజీవి, పైడిపల్లి మహేష్, పులి సత్యనారాయణ, పిట్టల రాము, మాలోత్ కోటి నాయక్, శాంతి వర్ధన్, అజిత్, సామా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పార్టీ జిల్లా స్థాయి సమావేశాన్ని

# జయప్రదం చేయండి

**బిఆర్ఎస్ లక్ష్మిదేవిపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ లావుడ్యా పూర్ణ**



**కొత్తగూడెం, అక్టోబర్18(కెరటం ప్రతినిధి)**

నేడు కొత్తగూడెంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ లక్ష్మిదేవిపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ లావుడ్యా పూర్ణ తెలిపారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఆదేశాల మేరకు కొత్తగూడెం తెలంగాణ భవన్‌లో జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధుసూధన్, మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరావు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, జిల్లా స్థాయి నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులతో పాటు అనుబంధ సంఘాలైన టిబిజికేఎస్, బిఆర్టియు, బిఆర్ఎస్వి, బిఆర్ఎస్ యువజన, బిఆర్ఎస్ పార్టీ అనుబంధ శాఖల ముఖ్య నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ లక్ష్మిదేవిపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ లావుడ్యా పూర్ణ పిలుపునిచ్చారు.

# స్వచ్ఛ భారత్ డ్రైవర్లు, హెల్పర్లకు జీతాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి



**కొత్తగూడెం, అక్టోబర్18(కెరటం ప్రతినిధి)**

పాల్వంచ మున్సిపాలిటీలో కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న స్వచ్ఛ భారత్ డ్రైవర్లు,హెల్పర్లకు మున్సిపాలిటీ ద్వారా జీతాలు ఇవ్వాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యెర్రా కామేష్ స్వచ్ఛ భారత్ డ్రైవర్లు హెల్పర్ల తో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం కలెక్టర్ జీతేష్.వి.పాటిల్ కు వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా కామేష్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ డ్రైవర్లు,హెల్పర్ల జీతాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని,అన్ని మున్సిపాలిటీలలో మున్సిపాలిటీ ద్వారా జీతాలు చెల్లిస్తూ పాల్వంచలో మాత్రం ఇంటింటికీ నెలకు రూ.50 వసూలు చేసుకొని డబ్బులు తీసుకోమనగా చాలా మంది ఇంటి యజమానులు డబ్బులు ఇవ్వక కొంతమంది ఇచ్చిన వారి కనీస అవసరాలకు సరిపోవడం లేదని,కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.స్వచ్ఛ భారత్ డ్రైవర్లు,హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22వ తేదీన మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోళ్ళపూడి ప్రవీణ్ కుమార్,కాకటి హుస్సేన్,రాయల పార్వతి,బత్తుల వెంకటేశ్వరమ్మ, దేవాళ్ళ రమణ,వేముల రమణ తదితరులు పాల్గొన్నారు.

# 50 వేల కార్నియా మార్పిడులు చేసిన మైలురాయిని జరుపుకుంటున్న ఎల్ వి ప్రసాద్

**హైదరాబాద్, అక్టోబర్18(కెరటం ప్రతినిధి)**

ప్రపంచంలో ఏ నేత్ర సంరక్షణా సంస్థకూడా ఎన్నడూ సాధించని విధంగా అత్యధిక కార్నియా మార్పిడులు (50 వేలు) చేసిన విశిష్టతను ఎల్విపిఇఐలో కార్నియా సంరక్షణకు అత్యుత్తమ కేంద్రమయిన శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్స్టిట్యూట్ సాధించింది. ఇది ఎల్విపిఇఐని ప్రపంచంలోని అత్యధిక పరిమాణ కార్నియా సంరక్షణా కేంద్రాలలో అగ్రగామిగా నిలబెట్టింది. ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ తన కల్లం అంజిరెడ్డి ప్రాంగణంలో ఈ మైలురాయి వేడుకను జరుపుకున్నది. భారతదేశంలోని వయోజన జనాభాలో దాదాపు 2% అంధులు మరియు దాదాపు 13% దృష్టి వైకల్యం ఉన్నవారు. భారతదేశంలో 50 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిలో అంధత్వానికి కార్నియా అపారదర్శకత రెండవ ప్రధాన కారణం - మరియు చిన్నవారిలో ప్రధాన కారణం. ఇన్ఫెక్షన్, ఘాతం లేదా ఇతర హాని కార్నియాను అపారదర్శకం చేసి, వ్యక్తిని అంధుడిని చేస్తుంది. అటువంటి కేసులలో, కార్నియా మార్పిడి ఒక పరిష్కారం కావచ్చు. ఇందులో మసకబారిన కార్నియా ఒక దాత టిష్యూతో మార్పిడి చేయబడుతుంది. శ్రద్ధాపూరితమైన సర్జన్ల బృందం మరియు విస్తారిత బృందం మరియు ప్రపంచవ్యాప్తంగా తమ నిధులు, సమయం మరియు ప్రతిభను ఉదారంగా వెచ్చించే మా మద్దతుదారులు మాపై ఉంచిన విశ్వాసంవలన ఈ బృహత్తరమైన విజయం సాధ్యమయింది. విలువైన టిష్యూను దానం చేయాలని ఎంచుకున్న కార్నియా దాతల కుటుంబాలు చూపిన ఉదారతవలన మాత్రమే ఇదంతా సాధ్యమయింది.

**వేడుకలలో భాగంగా:**

- ఎల్విపిఇఐ-స్థాపనాధ్యక్షులు డా గుళ్ళపల్లి ఎన్ రావు ఈ మైలురాయిని చేరుకోవడంలోని ప్రయాణాన్ని సభకు వివరించారు.
- ఎల్విపిఇఐ-ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డా ప్రశాంత్ గర్గ్ భారతదేశంలో నేత్రనిధి ప్రస్తుత స్థితి మరియు ముందుకు సాగే మార్గంగురించి మాట్లాడారు.
- శాంతీలాల్ సంఘ్వీ కార్నియా ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డా ప్రవీణ్ కృష్ణ పరిణామం చెందుతున్న సాంకేతికతలతో కార్నియా మార్పిడిలో భవిష్యత్తు అవకాశాలను తెలియజేసారు.




ఎల్విపిఇఐ నేత్రనిధి వ్యవస్థ ఈ మైలురాయి సాధ్యపడటంలో సంవత్సరాలుగా నిరంతర మద్దతు నిచ్చిన కీలక భాగస్వాములకు మరియు వాటాదారులకు ధన్యవాదాలు తెలిపారు. మా స్థాపనాధ్యక్షులు డా గుళ్ళపల్లి ఎన్ రావు తన భావాలను వ్యక్తీకరిస్తూ, “మేము ఈ ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు, అనేక సంశయవాదులు మమ్మల్ని నిరుత్సాహపరిచారు. ఈ శంకించేవారి నందరినీ తప్పుగా నిరూపించినందుకు నేను సంతోషిస్తున్నాను. అనేక మెలికలు మరియు మలుపులతో కూడి, ప్రతి మలుపులో నేర్చుకున్న పాఠాలతో జరిగింది ఈ ప్రయాణం. సంవత్సరాలుగా అవిరామంగా పనిచేసిన నా బృందాన్ని చూసి నేను గర్విస్తున్నాను, ఈ మైలురాయి చేరిన సందర్భంగా వారిని అభినందిస్తున్నాను,” అన్నారు.

ఎల్విపిఇఐ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డా ప్రశాంత్ గర్గ్ ఈ మహత్వపూర్ణ సమయంలో తన భావాలను పంచుకుంటూ, “ఈ మైలురాయి డా జి ఎన్ రావు దృఢ సంకల్పం మరియు తమ సమయం, ప్రతిభ మరియు ధనంతో మాకు మద్దతునిచ్చిన భారతదేశంలోని మరియు విదేశాలలోని అనేక వ్యక్తులు, సంస్థలవలన సాధ్యమయింది. వారి మద్దతు మరియు మార్గదర్శకత్వానికి వారిలో ప్రతి ఒక్కరికీ నా ధన్యవాదాలు. ఈ అద్భుతమైన బృందాన్ని చూసి నేను గర్విస్తున్నాను,” అన్నారు.

శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డా ప్రవీణ్ వడ్డవల్లి సంస్థ లక్ష్యాన్ని పునరుద్ఘాటిస్తూ “విజ్ఞాన సరిహద్దులను ముందుకు తీసుకు వెళుతూ, కార్నియా వ్యాధులున్నవారికి అత్యంత సముచిత చికిత్సను అందుబాటులో ఉంచడంపై శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్స్టిట్యూట్ కేంద్రీకరిస్తుంది,” అన్నారు.

ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ: “అవసరమున్నవారందరికీ అందుబాటులో ఉండే అత్యుత్తమ మరియు న్యాయబద్ధ నేత్ర సంరక్షణా వ్యవస్థను రూపొందించడం” అనే ఉద్దేశ్యంతో 1987 సంవత్సరంలో స్థాపించబడిన ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్విపిఇఐ) ఒక సమగ్ర నేత్ర ఆరోగ్య సౌకర్యం, , అంధత్వ నివారణకై ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకార కేంద్రం.

ఈ ఉద్దేశ్య సాధనలో, ఎల్విపిఇఐ వైద్యులు మరియు శాస్త్రవేత్తలు అత్యాధునిక నేత్ర పరిశోధన దిశలో కృషి చేస్తారు. తన ఐదు-శ్రేణుల ‘నేత్ర ఆరోగ్య పిరమిడ్’ నమూనా ద్వారా, సంస్థ ఇప్పటివరకూ 3 కోట్ల 89 లక్షలకు పైగా ప్రజలకు సేవచేసింది. అవసరమైన సంరక్షణ క్లిష్టతతో సంబంధంలేకుండా అందులో 50% పూర్తిగా ఉచితం. శాంతీలాల్ సంఘ్వీ కార్నియా ఇన్స్టిట్యూట్ (ఎస్ఎస్సిఐ) ఎల్విపిఇఐ రూపొందించిన అత్యుత్తమ సంస్థలలో మొదటిది. ఒక అంతర్జాతీయ వనరుల కేంద్రంగా ఊహించిన ఈ కేంద్రం ప్రపంచంలో కార్నియా సంబంధిత వైకల్యం, అంధత్వాల ప్రధాన కారణాలు, రూపాలను ప్రభావితం చేయడానికి కృషి చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా కార్నియా సంరక్షణ సౌకర్యాల సామర్థ్య నిర్మాణం మరియు అభివృద్ధికి ఇది ఒక ప్రధాన వనరు. ప్రపంచంలోని అతి పెద్ద కార్నియా సేవలను ఇది నిర్వహిస్తున్నది, సంరక్షణ నాణ్యత మరియు అందుబాటుకు గణనీయమైన సహకారాన్ని అందిస్తున్నది, అత్యధిక నాణ్యతగల శిక్షణా కార్యక్రమాలు మరియు పరిశోధనలో నాయకత్వం వహిస్తున్నది.



## ఎమ్మెల్యే పాయంను కలిసిన సీడీపీవో రేవతి

**పినపాక, అక్టోబర్18(కెరటం ప్రతినిధి)**

బూర్గంపాడు సీడీపీవోగా నూతనంగా భాద్యతలు చేపట్టిన రేవతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల కేంద్రం ప్రజాభవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని, మర్యాదపూర్వకంగా కలిసి పూల గుచ్చాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి ప్రధాన కార్యాలయములో సహపంక్తి భోజనాలు

**కొత్తగూడెం, అక్టోబర్18(కెరటం ప్రతినిధి)**

దసరా పండుగ, దేవి శరన్నవరాత్రుల సంధర్భముగా సింగరేణి ప్రధాన కార్యాలయము నందు కొలువై ఉన్న దుర్గామాత గుడి నందు శుక్రవారం సహపంక్తి బోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు హాజరై అమ్మవారిని దర్శించుకొని, ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగులకు దగ్గర ఉండి భోజనాలను వడ్డించారు. ఈ సహపంక్తి బోజనాలలో కార్పొరేట్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, అన్ని శాఖల జనరల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు, ఆలయ కమిటీ మెంబర్స్ బి.కోటి, మోహన్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.





## అన్నదానంలో పాల్గొన్న రజాక్

**కొత్తగూడెం, అక్టోబర్18(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం పరిధిలోని టూ ఇంక్లైన్ ఫిల్టర్ బెడ్లో అమ్మవారి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐఎన్టియూసి సివిల్ ఫిట్ సెక్రటరీ శనిగరపు కుమారస్వామి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా సివిల్ ఏజీఎం సిహెచ్ రామకృష్ణ, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ఆరంభించడం జరిగింది. ఇందులో రామవరం సివిల్ సూపర్వైజర్ శ్రీనివాస్, ఫిట్టర్ నాగేశ్వరావు, పంప్ ఆపరేటర్లు రహీం పాషా, రామ్ శంకర్, దశరథ్ పాసి, బి శ్రీనివాసరావు, బన్సీ, వాల్ ఆపరేటర్లు కొమురయ్య, చిట్టిబాబు, రమేష్, ప్రకాష్, జగదీశ్వర్‌రావు, ఏడుకొండలు, ప్రదీప్, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.